అర్ధాకలితోనే విద్యాభ్యాసం

- పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు బోధన
- ఆకలితో అలమటిస్తూ నీరసిస్తున్న చిన్నారులు
- దాతలు, స్వచ్ఛంద సంస్థలు స్పందించాలని వినతి



సాయంత్రం 5 గంటలకు పాఠశాల ఆవరణలో ప్రత్యేక సాధనలో పదో తరగతి విద్యార్థులు

గణపవరం: విద్యార్థి జీవితంలో కీలకమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు పునశ్చరణ తరగతులు, ప్రత్యేక బోధన, అనుమానాల నివృత్తి కోసం ప్రతి పాఠశాలలో ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. రోజువారీ స్లిప్ టెస్టులు, వారాంతపు పరీక్షలను ఆయా సబ్జెక్టులవారీగా నిపుణులు తయారుచేసిన నమూనా పరీక్షలను ప్రతి రోజూ నిర్వహిస్తూ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేస్తున్నారు. సర్కారు బడులకు వచ్చేవారిలో అధికశాతం నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఉంటారు. వీరు ఆ పాఠశాల సమీప గ్రామాల నుంచి రెండు నుంచి ఐదారు కిలోమీటర్ల దూరంనుంచి పాఠశాలలకు వస్తుంటారు. వీరు ఉదయం 7గంటలకే ఇళ్లవద్ద బయలుదేరి 8 గంటలకు ప్రారంభించే ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. అలాగే సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకూ ప్రత్యేక స్టడీ అవర్స్‌లో ఉంటున్నారు. దీనితో వీరు ఉదయంనుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక తరగతులు, చదువుతో అలసటకు గురవుతున్నారు. ఉదయం ఇంటివద్ద అల్పాహారం చేసిన వీరికి పాఠశాలలో మధ్యాహ్న భోజనంతప్ప ఇతరత్రా ఎలాంటి ఆహారం అందకపోవడంవల్ల ఆకలితో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం 5.30 గంటలకు ప్రత్యేక తరగతులు ముగిసి ఇళ్లకు చేరడానికి రాత్రి 6.30 నుంచి 7 గంటలు అవుతుంది. దీనితో విద్యార్థులు నీరసించి పోతున్నారు. సాయంత్రం వేళల్లో వీరికి అల్పాహారం వంటి ఏర్పాట్లు ఉంటే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు.



ధానమిల్లిలో దాతల సహకారంతో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ (ఫైల్)

అర్ధాకలితోనే ప్రత్యేక తరగతులకు

సాయంత్రం పాఠశాల విరామ సమయంలో కొందరు విద్యార్థులు బయట దుకాణాలవద్ద చిరుతిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు వంటివి కొనుక్కుంటుండగా, డబ్బులులేని విద్యార్థులు పాఠశాలలో సాయంత్రం వరకూ ఆకలితోనే ఉండిపోతున్నారు. గతంలో జిల్లా పరిషత్ వారు పదో తరగతి విద్యార్థులకు కొన్నాళ్లు అల్పాహారం అందించింది. తర్వాత ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామంలోని కొందరు దాతల సహకారంతో ప్రతిరోజూ పులిహోర, బిర్యాని, ఉడకబెట్టిన శెనగలు, పలావు, బజ్జీ, సమోసా, గారె, మసాలా వడలు వంటి అల్పాహారాన్ని విద్యార్థులకు అందించేవారు. అయితే కరోనా తర్వాత చాలా గ్రామాల్లో ఈ సంప్రదాయానికి ముగింపు పలికారు. నాలుగేళ్లుగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులలో అల్పాహారం అందడం లేదు.

దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకారం అవసరం

ఆయా పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళల్లో అల్పాహారం అందించడానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఉంగుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, ఎందరో దాతలు నిత్యం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం సమయంలో అల్పాహారం అందిస్తే వారు చదువుపై మరింత ప్రత్యేక దృష్టి సారించి మంచి ఫలితాలను సాధించే అవకాశం కలుగుతుంది.

నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులు

మండలం	హైస్కూళ్లు	విద్యార్థులు
గణపవరం	7	510
నిడమర్రు	7	328
ఉంగుటూరు	10	638
భీమడోలు	7	603
మొత్తం	31	2,079

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా

ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యాశాఖ వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా విద్యాశాఖ రూపొందించిన 100 రోజుల ప్రణాళికను అన్ని పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేస్తున్నారు. దీనితో కొన్నాళ్లుగా పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ఒక్కో గంటసేపు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీనితో విద్యార్థులు ఉదయం 8 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ ఏకధాటిగా పాఠశాలలోనే ఉంటున్నారు.

దాతల సహకారం కోరుతున్నాం



పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహణతో ఉదయం 8నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పాఠశాలల్లోనే ఉండి పోతున్నారు. దీనితో వారు అలసట, ఆకలితో ఇబ్బంది పడుతున్న విషయం గమనించాం. ప్రస్తుతం సెలవు రోజుల్లో పదోతరగతి విద్యార్థులకు మధ్యాహ్నం భోజన సదుపాయం ప్రభుత్వం కల్పించింది. మిగిలిన రోజుల్లో అల్పాహారం అందించడానికి ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో దాతలు, పూర్వవిద్యార్థులను సంప్రదించాలని సూచించాం.

– గొర్రెల బాలయ్య, ఎంఈవో, గణపవరం

క్లుప్తంగా

రాష్ట్రపతి అవార్డు గ్రహీత జెస్సీకి సత్కారం



జెస్సీని సత్కరిస్తున్న పాస్టర్లు

దెందులూరు : రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఇంటర్నేషనల్ స్కేటర్ మాత్రపు జెస్సీ రాజ్‌కు సోమవారం స్వగ్రామం జోగన్నపాలెం తోపాటు గోపన్నపాలెంలో ఘన స్వాగతం లభించింది. జోగన్నపాలెంలో సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి, మాజీ సర్పంచ్ పసుమర్తి ప్రభాకరరావు, సొసైటీ మాజీ చైర్మన్ డాక్టర్ పసుమర్తి మధు, గ్రామస్తులు జెస్సీకి పౌర సన్మానం చేశారు. జెస్సీ నివాసంలో సీఎస్ఐ చర్చి కౌన్సిల్ చైర్మన్ రెవరెండ్ ఆనంద్ కొండ, డీనరీ చైర్మన్ రఘువరన్, అలెగ్జాండర్ ప్యారిస్ పాస్టర్ జోగన్నపాలెం, పాస్టర్ ఇతర గ్రామాల పాస్టర్లు ప్రత్యేకంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేలు, ఫిజికల్ డైరెక్టర్లు, లెక్చరర్లు, కళాశాల సిబ్బంది విద్యార్థులు అవార్డు గ్రహీత జెస్సీకి రహదారి నుంచి కళాశాల వేదిక వరకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జెస్సీ తల్లిదండ్రులు సురేష్, రాధను అభినందించారు.

బడ్జెట్ పత్రాలు దహనం



బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

నిడమర్రు: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందంటూ సోమవారం బువ్వనపల్లిలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తాజా బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నారపల్లి రమణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మళ్లీ మొండి చేయి చూపించిందన్నారు. వెనుకబడిన జిల్లాలకు, జాతీయ ఉపాధి హామీ ఊసే లేదన్నారు. విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటీ, ఐఐటీ, గిరిజన యూనివర్సిటీ, దుగ్గరాజుపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్ వైజాగ్ మెట్రో, రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయింపు విస్మరించిందని విమర్శించారు. రాజధాని నిర్మాణంకు గతంలో ప్రకటించిన ప్రపంచ బ్యాంకు రుణాన్ని పదే పదే ప్రస్తావించడం మినహా చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాస్, గవర సత్యనారాయణ, లావేటి సోంబాబు, కమిలి నాని తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: చేబ్రోలు సెక్షన్ పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వేణు తెలిపారు. చేబ్రోలు 33/ 11 కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్త 11 కేవీ చేబ్రోలు డొమెస్టిక్-2, ఇండస్ట్రియల్-2 ఫీడరు విస్తరణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ సోమవారం తెలిపారు.

శాంతితోనే నవ సమాజ నిర్మాణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శాంతితోనే నవ సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ నూరుల్ ఇస్లాం శాఖ రాష్ట్ర ప్రజా సంబంధాల అధికారి ముహమ్మద్ జావిద్ అహ్మద్ పాషా అన్నారు. ప్రపంచ శాంతి స్థాపన కోసం ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటిస్తూ సోమవారం ఆయన ఏలూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా శాంతి, సౌభ్రాతృత్వాన్ని ప్రోత్సహించేందుకు శాంతి సమ్మేళణాలు, సెమినార్లు, చర్చాగోష్టిలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సర్వ ధర్మాల అవతార పురుషులను పరస్పరం గౌరవించుకున్నప్పుడే ప్రపంచంలో శాంతిని స్థాపించవచ్చన్నారు. జిల్లా మీడియా ప్రతినిధి మునవ్వర్ అహ్మద్ మస్తాన్ మాట్లాడుతూ అహ్మదియ్య ముస్లిం కమ్యూనిటీని హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ 1889వ సంవత్సరంలో పంజాబ్ రాష్ట్రం, ఖాదియాన్ నగరంలో స్థాపించి, శాంతి స్థాపన కోసం నేడు 200లకు పైగా దేశాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రపంచ శాంతి కోసం కమ్యూనిటీ ఐదవ ఖలీఫా (ఉత్తరాధికారి) హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ నేతృత్వంలో అందరినీ ప్రేమించు.. ఎవ్వరినీ ద్వేషించకు అనే నినాదంతో హ్యూమానిటీ ఫస్ట్ శాఖ ఆధ్వర్యంలో మానవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

జీజీహెచ్‌కి ఆరు వీల్‌చైర్లు

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగులకు ఒక దాత ఆరు వీల్‌చైర్లను అందజేశారని సూపరింటెండెంట్, అదనపు డీఎంఈ ఎంఎస్ రాజు తెలిపారు. సోమవారం వాటిని సిబ్బందికి ఆయన అందజేశారు. రోగులకు మాత్రమే వీల్‌చైర్లు వినియోగించాలని, సామగ్రిని తరలించేందుకు ఉపయోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ సూపరింటిండెంట్ ధన్యశ్రీ, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఎస్తేరురాణి తదితరులున్నారు.

చెన్నకేశవ స్వామి ఆలయంలో శాంతి కల్యాణం



ప్రత్యేకాలంకరణలో చెన్నకేశవ స్వామివారు

దెందులూరు: దెందులూరు చెన్నకేశవ స్వామి ఆలయంలో సోమవారం శాంతి కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన దేవుని మురళీకృష్ణ వెంకటలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు ఆలయ అర్చకులు పార్థసారథి, రామదండు మండలం నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు పంపిణీ చేశారు.



శాంతి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేటి నుంచి అచ్చమ్మ పేరంటాలు తల్లి ఉత్సవాలు



సిద్ధమైన వేదిక

దెందులూరు: కోస్తా జిల్లాల్లో ప్రసిద్ధిగాంచిన నమ్మిన భక్తుల పాలిట కొంగుబంగారంగా పూజలు అందుకుంటున్న ఇలవేల్పు గాలయగూడెం అచ్చమ్మ పేరంటాలు తల్లి 68వ వార్షిక ఉత్సవాలు మంగళవారం నుంచి తొమ్మిది రోజులుపాటు జరగనున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఉత్సవాలను ప్రారంభిస్తారు. పెదవేగి సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెదవేగి సర్కిల్లోని ఎస్సైలు హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ మహిళా పోలీసులు ఉత్సవాల్లో అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహిస్తారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తాగునీరు, వాహనాలు నిలుపుదల చేయడానికి పార్కింగ్‌తో పాటు అన్ని సౌకర్యాలు ఆలయ కమిటీ ఏర్పాటు చేశారు. ప్రతిరోజు అమ్మవారి ఆలయంలో పూజలు భజనలు జరుగుతాయి. భక్తులకు ఆహ్లాదంగా ఉండేందుకు ప్రత్యేకంగా ఆలయానికి స్వాగత ద్వారాలకు వివిధ రకాల విద్యుత్ బల్బులతో అలంకరణ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులందరికీ గతంలో మాదిరిగానే ఎటువంటి ఇబ్బందులు అసౌకర్యం కలుగాకుండ గ్రామస్తులు వలంటీర్లుగా ప్రత్యేక సేవలు అందించనున్నారు. పెరగనున్న భక్తుల సౌకర్యార్థం దాతల దాతృత్వంలో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో విశాలమైన సౌకర్యవంతంగా స్టేజీని నిర్మించారు.



గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మవారు

జిల్లా స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

దెందులూరు: కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలుర బాలికల యూత్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించినట్టు హెచ్ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ తెలిపారు. ఈ పోటీలకు సుమారు 80 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ నెలలో నిర్వహించనున్న ఏపీ యూత్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ ఎంపికల్లో ఎస్ఎంసీ కో-ఆప్షన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షణలో నిర్వహించినట్టు తెలిపారు.

కమ్ముకున్న పొగ మంచు..ప్రయాణానికి విఘాతం

భీమడోలు: దట్టంగా కురిసిన పొగమంచు సోమవారం మండలాన్ని కమ్మేసింది. మంచు తెరలతో ప్రకృతి సోయగాలు కనువిందు చేస్తున్నాయి. ఉదయం వేళ దట్టమైన మంచు దుప్పటి నుంచి బయట రావడానికి సైతం సూర్యుడుని కూడా చాలా సమయమే పడుతోంది. ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు పొగమంచుతో తడిసిముద్దయ్యాయి. మంచు వర్షంలా కురుస్తుండడంతో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. తెల్లవారుజాము నుంచి భారీగా కురుస్తున్న పొగ మంచుతో జన జీవనం స్తంభించింది. ప్రమాదాల భయంతో వాహనచోదకులు రోడ్ల పక్కనే తమ వాహనాలను నిలిపి ఉంచారు. చలితో కూడిన మంచు ఉదయం తొమ్మిది గంటల వరకు తగ్గకపోవడంతో రోజు వారీ కూలీలు, రైతులు, ఉద్యోగులు సైతం రోడ్లపై రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొగ మంచు వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక వెలుతురు కోసం లైట్లు వేసుకుని నెమ్మదిగా రోడ్లపై ప్రయాణిస్తున్నారు. దీనితో ఉద్యోగులు గమ్య స్థానాలకు ఆలస్యంగా చేరుకుంటున్నారు. రైతులు, కార్మికులు, ఇటుకల బట్టీల కార్మికులు, పెట్రోలు బంకుల్లోని సిబ్బంది ఆ మంచు తెరల్లోని విధులు నిర్వహిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, వ్యాధిగ్రస్తులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈనెల 26వ తేదీ మహాశివరాత్రి నుంచి ఎండలు ముదురుతాయని, అప్పటి వరకు పొగ మంచు బెడద ఉంటుందని, ప్రజలంతా తగు జాగ్రత్తలు పాటిస్తూ నిత్య కార్యకలాపాలు సాగించాలని కోరుతున్నారు.



జాతీయ రహదారిని కమ్మేసిన పొగ మంచులో లైటు వేసుకుని వెళ్తున్న వాహనచోదకుడు



భీమడోలులో మంచులోనే ఇటుకలు తీస్తున్న కార్మికులు

విద్యార్థినులకు బహుమతుల ప్రదానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థినులు అన్ని రంగాల్లోనూ పట్టు సాధించాలని సీఆర్ఆర్ మహిళా కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు అన్నారు. సీఆర్ఆర్ మహిళా కళాశాలలో ఇటీవల విద్యార్థినులకు నిర్వహించిన సాంస్కృతిక, సాహిత్య క్రీడా వారోత్సవాల్లో విజయం సాధించిన వారికి సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథరావు మాట్లాడుతూ ఇటీవల క్రీడల్లో తెలుగు అమ్మాయిలు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొస్తున్నారని తెలిపారు. సీఆర్ఆర్ మహిళా కళాశాలలో విద్యాభ్యాసం చేసిన వారిలో అనేక మంది దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత విద్యార్థినులు మరింతగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లి సరస్వతికి పూజలు



గుండుగొలనులో చిన్నారులకు విద్యా సామగ్రి అందిస్తున్న హెచ్ఎం పాశం పాండురంగారావు



అక్షరాభ్యాసం పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమడోలు: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతీదేవికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూజలు చేసారు. గుండుగొలను-1 పాఠశాలలో వసంత పంచమిని పురస్కరించుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన మామిళ్లపల్లి జ్యోతిష్‌కుమార్, సునీల్ ఆర్థిక సాయం రూ.2,500తో పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు అభ్యసన సామగ్రిని ఉచితంగా అందజేసారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పాశం పాండురంగారావు, టీచర్లు ఆనందబాబు, దత్తు, సంధ్య, ఝాన్సీ, పెద్దలు పాల్గొన్నారు.

విజ్ఞాన భారతి పాఠశాలలో అక్షరాభ్యాసాలు

ఉంగుటూరు: విజ్ఞాన భారతి పాఠశాలలో 72 మంది విద్యార్థులకు అక్షరాభ్యాసన చేయించారు. వసంతి పంచమి సందర్భంగా సోమవారం వైభవంగా ఈ కారక్యక్రమం నిర్వహించారు. విజ్ఞాన భారతి పాఠశాల ప్రిన్సిపాల్ రమణరావు, కరస్పాండెంటు పాతూరి వంశీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

యథేచ్ఛగా గోదావరి కాలువ గట్ల ఆక్రమణ

- భారీ వృక్షాలను నరికివేస్తున్న ఆగంతకులు
- రోజు రోజుకీ కుంచించుకుపోతున్న కాలువ వెడల్పు



గోదావరి కాలువ గట్లపై నిర్మించిన షెడ్లు



చెట్లను నరికి వేస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలో సాగుకు, తాగు నీటికి అత్యంత కీలకమైన, అతి ప్రధానమైన ఏలూరు గోదావరి కాలువ రోజురోజుకీ ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లి విస్తీర్ణం తగ్గి కుంచించుకుపోతోంది. దానికి తోడు కాలువ గట్లపై 40- 50 ఏళ్ల వయసు కలిగిన భారీ వృక్షాలను సైతం కొంతమంది అక్రమంగా ఉద్యోగుల సహకారంతో నరికివేస్తున్నారు. కాలువ గట్లను ఆక్రమించేందుకు చెట్లను నరికి కలపను విక్రయించి సొమ్ము దోచుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోదావరి కాలువ గట్లుపై ఏళ్ల నాటి చెట్లు ఆకులు, కొమ్మలతో పచ్చగా ఉన్నప్పటికీ సమీప ప్రాంతంలో పెట్టిన మంట కారణంగా చెట్ల మొదలులో తొర్ర పడింది. దీంతో భారీ వృక్షాన్ని నరికి వేస్తున్నట్టు ఉద్యోగులు తెలిపారు. న్యాయవాది కంజీరమణ, స్థానికులు సంఘటనా స్థలానికి వెళ్లి నిలదీయడంతో పనులను నిలుపుదల చేశారు. వెంటనే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి ఆయన తీసుకెళ్లారు. ఫొటోలు, వీడియోలు వారికి పంపించారు. అన్ని శాఖల ఉద్యోగుల నిర్లక్ష్యంపై న్యాయపరంగా పోరాటం చేస్తామని, వారం రోజుల కిందట మండల అధికారులకు లిఖితపూర్వకంగా స్వయంగా తాను ఫిర్యాదు చేశానని న్యాయవాది తెలిపారు. దీనికి తోడు నిబంధనలకు విరుద్ధంగా భీమడోలు నుంచి గుండుగొలను జంక్షన్, సింగవరం వద్ద పెద్ద ఎత్తున కాలువ గట్టున సర్వీసింగ్ పాయింట్, హోటల్, టైర్ల కొట్లు, బడ్డీ కొట్లు, టీ కొట్లు ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. హైవే వద్ద దెందులూరు నుంచి కొవ్వలి వచ్చే అడ్డ రోడ్డు వద్ద కాలువను ఆక్రమించి ఇటుకల బట్టీలు, గడ్డి వాములు, షెడ్లు సైతం నిర్మించి దర్జాగా అనుభవిస్తున్నారు. 1988లో దెందులూరుకి చెందిన కొంతమంది పేదలకు అప్పటి ప్రభుత్వం చెట్టు పట్టా పథకం కింద కొంత భూమిని మొక్కలు పెంచుకునేందుకు అందించింది. అక్రమార్కులు ఆ భూమిని స్వాధీనం చేసుకుని దశాబ్దాల కాలంగా పెరిగిన చెట్లను నరికివేస్తున్నారు. ఈ సమస్యపై దెందులూరుకు చెందిన కొంతమంది ఎంపీడీవో, ఇరిగేషన్ శాఖ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దెందులూరు మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఇరిగేషన్ కాలువ గట్టును పరిశీలించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గోదావరి కాలువపై ఆక్రమణలు తొలగించాలని, చెట్ల తొలగింపును నిలుపుదల చేయాలని ప్రజలు, రైతులు, రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.